తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## చిరుతపులి మృతి కేసులో
# అటవీశాఖ అధికారుల ఆధీనంలో ముగ్గురు

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
యాదమరి మండలం మాదిరెడ్డిపల్లి పంచాయతీ తాళ్ళమడుగు గ్రామ అటవీ ప్రాంతంలో మృతి చెందిన మగ చిరుతపుల్లి కేసులో అటవీశాఖ అధికారులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. తాళ్ళమడుగు అటవీ ప్రాంతంలో ఓ వారం రోజుల క్రితం ఓ చిరుతపులిరి వేటగాళ్లు కరెంటు ఉచ్చు వేసి చంపారు. చిరుతపులి మృతి చెందిన అనంతరం నిందితులు చిరుతపులికి చెందిన గోళ్ళు, పళ్ళు కోసి తీసుకెళ్ళిపోయారు. అటవీ ప్రాంతంలో చిరుతపులి మృతి చెంది నాలుగైదు రోజులైనప్పటికీ ఎవరికి తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులకు ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం ఫోన్ చేసి చిరుతపులి మృతి చెందినట్లు సమాచారం అందించాడు. దీనిపై అటవీశాఖ అధికారులు రంగంలోకి చిరుతపుల్లి మృతి చెందిన ప్రాంతం చేరుకుని, పరిసరాలను పరిశీలించి వెటర్నరీ, జూ డాక్టర్లను రప్పించి చిరుతపుల్లి మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. ఈ క్రమంలో చిరుతపులిని ఎవరు చంపారనే విషయంపై అటవీశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా తమకు చిరుతపులి మృతి చెందిన విషయం చెప్పిన వ్యక్తిని ప్రశ్నించడానికి అటవీశాఖ అధికారులు సిద్ధం అయ్యారు. ఈ మేరకు తాళ్ళమడుగు గ్రామం చేరుకుని తమకు ఫోన్ చేసి సమాచారం అందించిన మధు అనే వ్యక్తిని అటవీశాఖ అధికారుల ప్రశ్నించారు. ఈ సమయంలో మధు ఇంటిని అటవీశాఖ అధికారులు సోదా చేయడంతో అక్కడ వన్య మృగాల తోళ్ళు, కొమ్ములు వుండటం గుర్తించిన అధికారులు మధును అనుమానించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే బంగారుపాళ్యం మండలానికి చెందిన మరో ఇద్దరిని అటవీశాఖ అధికారులు అనుమానించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

# సిఐడి అధికారుల సోదాలు

### -కుప్పం మద్యం డిస్టలరీలో తనిఖీలు.. రికార్డుల పరిశీలన

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మద్యం డిస్టలరీల్లో సిఐడి అధికారుల తనిఖీల్లో భాగంగా మంగళవారం కుప్పం పట్టణంలోని మద్యం డిస్టలరీలో సిఐడి అధికారులు తనిఖీలు నిర్వహించారు. కుప్పం పట్టణం డికెపల్లి అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న వ్యాంటేజ్ మద్యం డిస్టలరీలో సిఐడి ఎఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో వచ్చిన అధికారులు సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా డిస్టలరీలో తయారైన మద్యం వివరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా పలుఫైళ్లను తమ వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. గత వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో మద్యం తయారీ, కొనుగోళ్లు, విక్రయాల్లో అవకవతకలు జరిగాయని ఫిర్యాదులు ఉన్న నేపథ్యంలో సిఐడి అధికారులు కుప్పంలోని మద్యం డిస్టలరీలో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఇక్కడ తయారవుతున్న మద్యం బ్రాండ్లను పరిశీలించారు. ఈడిస్టలరీకి సంబంధించిన నివేదికను సిఐడి అధికారులు ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**గుడిపాలలో**

గుడిపాల, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
గుడిపాల మండలం నరహరిపేటకు సమీపంలో వున్న ఎంబీడిఎల్(మోహన్ బేవరేజ్ అండ్ డిస్టలరీస్ లిమిటెడ్)పై మంగళవారం సిఐడి అధికారుల బృందం దాడులు చేశారు. జిల్లా వ్యాప్తంగా సిఐడి అధికారుల బృందాలు బేవరేజ్ అండ్ డిస్టలరీస్‌పై దాడులు నిర్వహించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నరహరిపేటకు సమీపంలో వున్న మోహన్ బేవరేజ్ అండ్ డిస్టలరీస్ లిమిటెడ్‌పై సిఐడి దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడులకు సిఐడి డిఎస్పీ వేణుగోపాల్ నేతృత్వం వహించారు. ఈ దాడుల్లో సిఐడి అధికారులు 2019 నుండి 2024 వరకు బేవరేజ్ అండ్ డిస్టలరీస్‌లో వున్న డిజిటల్ రికార్డులు, కంప్యూటర్ డేటాలను తనిఖీ చేశారు. అలాగే ఇక్కడ తయారు చేస్తున్న రామెటీరియల్ స్పిరిట్ తయారైన అనంతరం ఎవరెవరికి సరఫరా చేశారనే విషయంను క్షుణ్ణంగా పరిశీలించారు.

# ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్టు

### 362 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 3,55,000 నగదు, బొలెరో వాహనం స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి వద్ద వున్న 362 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 3,55,000 నగదు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు క్రైం డిఎస్పి రమణ కుమార్ తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేది తిరుపతి రూరల్ మండలంలోని తిరుమల నగర్, రెవెన్యూ కాలనీలో 3 ఇళ్లలో దొంగతనంలు జరిగాయని సుమారు 11 లక్షల నగదు, 438 గ్రాముల బంగారం దొంగతనం జరిగిందని వెల్లడించారు. ఈ విషయం పై తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాలతో చంద్రగిరి ఎస్‌డిపిఓ ప్రసాద్ సూచనలతో నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారి కోసం దర్యాప్తు చేసి గాలించి మంగళవారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి బైపాస్ నందు ఆర్‌సి పురం సర్కిల్ వద్ద శెట్టి మణి అలియాస్ మనిమారాన్ (40), శెట్టి సూర్యలను అరెస్టు చేసి వారి వద్ద నుండి చోరీ సొత్తు 360 గ్రాముల బంగారు ఆభరణాలు, 3,55,000 నగదు స్వాధీనం చేసుకుని ముద్దాయిలను రిమాండ్‌కు పంపడం జరిగింది. ఈ కేసులో విశేష ప్రతిభ కనబరిచిన ముద్దాయిలను అరెస్టు చేయుటలో ప్రతిభ కనబరిచిన తిరుపతి రూరల్ సిఐ టి. చిన్న గోవిందు, ఎస్ఐ షేక్‌షావలి, ఎఎస్ఐ రాఘవ, హెచ్‌సి వాసుదేవ రావు, హెచ్‌సి రవి ప్రకాష్, పిసి ఆరిఫ్, పిసి ప్రభాకర్, పిసి ప్రసాద్‌లకు రివార్డు నిమిత్తం సిపార్సు చేసినట్లు క్రైం డిఎస్పి రమణ కుమార్ తెలిపారు.

# ఆహో..ఏమి రుచి తినరా మైమరచి!

### -భక్తులతో కలసి సామాన్యుడిగా అదనపు ఈఓ అన్నప్రసాదాల స్వీకరణ

తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి: గోవింద నామంతో తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు ఆకలి తెలియకుండా స్వీకరించే ఉచిత అన్నప్రసాదాల నాణ్యత, రుచి ఎంతో మెరుగుపడిందని, ఇప్పుడు బావుందని పలువురు సామాన్యభక్తులేగాక ప్రముఖులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నంతోబాటు సాంబారు, రసం, చట్నీ, బెల్లపుపొంగలి(స్వీట్),మజ్జిగ ఇవన్నీ భక్తులకు వడిస్తున్నారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు నాణ్యతపై కూడా ఇప్పుడు సంతోషం చెందుతున్నారు. తిరుమలలో తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న తీరు, భక్తులు స్వీకరించే విధానంపై మంగళవారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందీమార్బలం ఏదీ వెంట పెట్టుకోకుండా ఒక్కరే ఆయన సామాన్యభక్తుడిగా భక్తుల్లో కలసిపోయి అన్నప్రసాదం స్వీకరించారు. సిబ్బంది వడ్డిస్తున్న తీరును గమనించారు. భక్తులతో కలసి వారినుండి నాణ్యత, రుచిని అడిగి తెలుసుకున్నారు. భక్తులందరూ ఎంతో బావుందని, గతంలోకంటే ఇప్పుడు అన్నప్రసాదాలు నాణ్యత మెరుగుపడటం సంతోషం కలిగిస్తోందని తెలిపారు. ఆ సమయంలో సమాచారం తెలుసుకుని అన్నప్రసాదం డిప్యూటీ ఈఓ రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి అక్కడకు చేరుకుని తమవంతుగా అన్నప్రసాదాల నాణ్యత తెలిపారు.

# తవణంపల్లెలో కుంభవృష్టి

### పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

### భారీ వర్షాలకు కొట్టుకుపోయిన తొడతర వంతెన , మరో మూడు వంతెనలు పాక్షికంగా ధ్వంసం

వరద ఉధృతికి కొట్టుకుపోయిన గాజులపల్లె-తొడతర గ్రామాల మధ్య నున్న బ్రిడ్జి, అరగొండ వద్ద దెబ్బతిన్న కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేస్తూ ముళ్ళకంచెను అడ్డంగా వేసి అధికారులు.

తవణంపల్లె, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
మండలంలో సోమవారం రాత్రి రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొన్ని నదులు, వాగులు వంకలు ఒక మోస్తరుగా ప్రవహిస్తున్నాయి. అయితే సోమవారం రాత్రి మండలంలో రికార్డు స్థాయిలో 103 మి.మి. వర్షపాతం నమోదైంది. దీనితో వరద ఉధృతి తీవ్రంకావడంతో మండలంలో వాగులు,వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని పడమటి సరిహద్దు మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీ వర్షాలు కురవడంతో వరదనీరు భారీగా మండలానికి వచ్చి చేరుతోంది. దీనితో మండలంలోని అరగొండ సమీపంలో బహుదానది ఉధృతంగా ప్రవహిస్తాంది. ఈ మేరకు బహుదానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గాజులపల్లె-తొడతర గ్రామాల వద్ద నదిపై నిర్మించిన కాజ్‌వే(బ్రిడ్జి) పూర్తిగా కొట్టుకుపోయింది. అలాగే మండలంలోని ఈ బ్రిడ్జి దెబ్బతినడంతో సరకల్లు వైపు వెళ్ళే సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయింది. అలాగే బహుదానదిపై అరగొండ-జొన్నగురకల రోడ్డు అరగొండ వద్ద నిర్మించిన వంతెన కూడా 50 శాతంకు పైగా దెబ్బతింది. మండలంలో అలాగే అరగొండ-గాజులపల్లె రోడ్డులో బహుదానదిపై నిర్మించిన వంతెన, పుణ్యసముద్రం వద్ద నిర్మించిన వంతెనలు కూడా కోతకు గురై కొట్టుకుపోయే స్థాయికి చేరుకున్నాయి. దీనితో ఆమార్గంలో వెళ్ళే ప్రయాణీకులు, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి కుంభవృష్టి కురిసినప్పటికి మండలంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకపోవడంతో మండల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు బహుదానది ఉప్పొంగి ప్రవహిస్తుండడం, తొడతర బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయాన్ని మండల తహశీల్దార్ సుధాకర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. దీనితో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బి డీఈ రాధిక, పంచాయతీరాజ్ అధికారులు, తహశీల్దార్ సుధాకర్‌లు మంగళవారం ఉదయం మండలంలో వర్షాలకు కొట్టుకుపోయిన తొడతర కాజ్‌వేను దెబ్బతిన్న మరో మూడు వంతెనలు పరిశీలించారు. అలాగే పాక్షికంగా దెబ్బతిన్న వంతెనల వద్ద జేసీబిలతో జంగిల్ క్లియరెన్స్ చేశారు. అలాగే భారీ వర్షానికి బహుదానది ఉధృతంగా ప్రవహిస్తుడడంతో రైతులు పలు ప్రాంతాల్లో గంగమ్మకు పూజలు నిర్వహించారు.అలాగే మండలంలోని పలు చిన్నచిన్న వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుడడంతో రైతులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అరగొండ వంతెనపై రాకపోకలు నిలిపివేత**

వరద ఉధృతికి బహుదానదిపై అరగొండ వద్ద నిర్మించిన కాజ్‌వే దెబ్బతినడంతో కాజ్‌వేపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అరగొండ వంతెన చాలావరకు దెబ్బతింది.దీనితో అరగొండ-జొన్నగురకల రోడ్డు మార్గాన్ని మూసివేశారు. స్థానిక సర్పంచ్ టి.మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, కార్యదదర్శి మురుగేషన్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేశారు. ఈసందర్భంగా కాజ్‌వేకు ఇరువైపులా ముళ్ళకంపలను వేశారు. అలాగే ఈమార్గం గుండా వెళ్ళే ప్రయాణీకులు రెడ్డిపల్లెమిట్ట, గాజులపల్లె మీదుగా వెళ్ళాలని సర్పంచ్ టి.మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, కార్యదదర్శి మురుగేషన్‌లు తెలిపారు.

## ఒక్కసారిగా నిండిన ఎన్టీఆర్ జలాశయం



**- రెండు గేట్లు ఎత్తివేసి దిగువకు వరదనీరు విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు**
**- ఇప్పటికీ వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
చిత్తూరు నగర ప్రజల దాహార్తి తీర్చడానికి పెనుమూరు మండలం కలవగుంటకు సమీపంలో నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం మం గళవారం ఒక్కసారిగా నిండిపోయింది. ఎన్టీఆర్ జలాశయంకు ఎగువ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో గత రెండు రోజులుగా జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతుంది. మంగళవారం సాయంత్రానికి ఒక్కసారిగా జలాశయంలోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో అప్రమత్తం అయిన ఇరిగేషన్ అధికారులు ఎన్టీఆర్ జలాశయం రెండు గేట్లు ఎత్తివేసి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జలాశయానికి ఇన్‌ఫ్లోగా వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి నిల్వ అవుతుంది. కాగా ఇరిగేషన్ అధికారులు జలాశయం రెండు గేట్లు ఎత్తివేసి దిగువ ప్రాంతాలకు వెళ్తుంది. ఎన్టీఆర్ జలాశయంలో 294.25 మీటర్లలోతులో 109.17 ఎంసిఎఫ్‌టిల నీరు నిల్వ చేయడానికి అవకాశం వుంది. గత ఐదేళ్ళుగా సరైన వర్షాలు కురువకపోవడంతో ఎన్టీఆర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండలేదు. ప్రస్తుతం సైతం వర్షాకాలం ముగుస్తున్న సమయానికి ఎన్టీఆర్ జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో గత రెండు మూడు రోజులుగా జలాశయంకు వర్షపు నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం సాయంత్రానికి ఎన్టీఆర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండటంతో ఇరిగేషన్ అధికారులు జలాశయంకు చెందిన రెండు గేట్లను ఎత్తివేసి నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు బుధవారం అధికారికంగా ఎన్టీఆర్ జలాశయం గేట్లను ఎత్తివేసి నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేయనున్నారు.

# టిడిపి కార్యకర్త హత్య బాధాకరం

### హత్యకు గురైన హరిప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించిన పలువురు ఎమ్మెల్యేలు
### మృతుని కుటుంబాలకు ఐదు లక్షల ఆర్థిక సహాయం
### హరిప్రసాద్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుంది

గూడూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త
చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు గ్రామపంచాయితీలో నాంచారం పేట గ్రామంలో అరుంధతి వాడకు చెందిన టిడిపి కార్యకర్త మల్లవరపు హరిప్రసాద్‌ని మంగళవారం వైసిపి కార్యకర్తలు, నాయకులు హత్య చేయడం బాధాకరమని సర్వేపల్లి ఎమ్మెల్యే పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న సర్వేపల్లి సర్వేపల్లి ఎమ్మెల్యే నెలవల విజయ్ శ్రీ, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో మార్చురీలో ఉన్న హరిప్రసాద్ మృతదేహాన్ని చూసి నివాళులు అర్పించారు. అనంతరం వారు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో వైసిపి శ్రేణులు వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన దారుణాలు ఒక ఎత్తు అయితే ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దానికి రెట్టింపుగా వైసిపి కార్యకర్తలు ప్రవర్తిస్తున్నారని ఇలాంటి దారుణాలకు ఓడికడితే సహించేది లేదన్నారు.

అభం శుభం తెలియని యువకుడ్ని హత్య చేయడం బాధాకరమన్నారు. జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి నియోజకవర్గాన్ని ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు చొరవ తీసుకుంటారన్న నమ్మకం మాకు ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామృష్ణ, నెలవల విజయశ్రీ ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య, ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, జానకిరామరెడ్డి, జనసేన బిజేపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉల్లాస్ కార్యక్రమంతో సంపూర్ణ అక్షరాస్యత

### కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
ఉల్లాస్(అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం ద్వారా జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడానికి పక్కా ప్రణాళికను రూపొందించి పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల్లో జిల్లాలోని నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పక్కా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సంఘాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆయాలు, హెల్పర్లు, వాచ్‌మెన్లతో పాటు 15 నుండి 50 సంవత్సరాలలోపు వయసు కల్గిన నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం అన్నారు. అలాగే వృత్తి నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక విద్య, సమానత్వంను అందించడంతో పాటు సంపూర్ణ వయోజన విద్య కోర్సుల ద్వారా నిరంతర విద్యను ప్రోత్సహించడం ఉల్లాస్ పథకం లక్ష్యం అని వివరించారు. జిల్లాలో ఈ నెల 30వ తేదీలోపు మండలాల వారీగా నిరక్షరాస్యుల వివరాల సేకరణ, మాస్టర్ ట్రైనర్ ఎంపిక, సంబంధిత సర్వేను నాణ్యతతో పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 9,078 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ధేశించిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఎంపిడిఓల అధ్యక్షతన సంబంధిత మండలా శాఖ అధికారులతో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు, వయోజన విద్య ఎడి నాగేశ్వరరెడ్డి, డిఎల్‌డిఎ రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి పార్వతి, ఐసిడిఎస్ పిడి హైమావతి, ఎపిఓ రవి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూసేకరణ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త
జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై ఎన్హెచ్ఎఐ, రెవెన్యూ సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని, నిర్మాణ పనులు నిర్దేశిత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులకు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డు తదితరాలకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై జెసి శుభం బన్సల్‌తో కలిసి ఎన్హెచ్ఎఐ పిడిలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీఓలు తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి, సంబంధిత మండలాల తహశీల్దార్లు, విఆర్ఓలు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న కడప - రేణిగుంట, రేణిగుంట - నాయుడుపేట ఆరు లేన్ వంటి రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుండి రేణిగుంట వరకు ఆరు లైన్లు రహదారి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని భూ సేకరణలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట - తూర్పు కనుపూరు ఆరు లేన్ల రహదారి 35 కిలోమీటర్లు, చిల్లకూరు క్రాస్ నుండి తూర్పు కనుపూరు వరకు 4 లేన్ల రహదారి, తూర్పు కనుపూర్ నుండి కృష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ ఆరు లేన్ల రహదారి 36 కి.మీ, తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్ట్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు ఆరు లేన్ల రహదారి 16 కి.మి అభివృద్ధి పనులు కూడా టైం లైన్ మేరకు పూర్తి చేయాలని సూచించారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎన్హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెన్నై జాతీయ రహదారి 205కి సంబంధించిన విస్తరణ కొత్త ప్రతిపాదనలకు చెందిన భూసేకరణ చేపట్టాలని, అలాగే రైల్వే ప్రాజెక్టులు శ్రీకాళహస్తి నడికుడి ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీఓలు, తహశీల్దార్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూ సేకరణ పనులలో పురోగతి ఉండాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్, ఐఐటి, ఐజర్, ఐఐఐటీ శ్రీసిటీకి సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వరచర్యలు తీసుకోవాలని ఆర్డివోలను ఆదేశించారు. ఈ సందర్భంగా జేసి భూసేకరణ పెండింగ్ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పిడి ఎన్హెచ్ఎఐలు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకె చౌదరి, చెన్నై రవీంద్ర రావు, జిల్లా సర్వేయర్ అరుణ్, తహశీల్దారు సర్వేయర్లు, విఆర్ఓలు కలెక్టరేట్ విభాగం డిటి భాస్కర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు సారా తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 22** ప్రభాతవార్త: మండల పరిధిలోని చిన్నతయ్యారు గ్రామ పరిసరాల్లో నాటు సారా తయారీ కేంద్రాలపై ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. గత పది రోజుల్లో చిన్నతయ్యారు గ్రామ పరిసరాల్లో పోలీసులు నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించడం ఇది రెండవసారి. ఈ సందర్భంగా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ గ్రామ పరిసరాల్లో నాటుసారా కాసి విక్రయాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుమన్‌తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఓను కలిసిన దేశం నాయకులు

**పాలసముద్రం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

నూతనంగా ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌రెడ్డిని మంగళవారం తెలుగుదేశం నాయకులు ఎంపిడిఓ కార్యాలయంలో మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఎంపిడిఓతో మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఎంపిడిఓ మహేష్‌రెడ్డి నాయకులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓని తెలుగుదేశం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తంగరాజు, సాంబశివన్, నాగరాజు, నవీన్‌చౌదరి, సుధాకర్‌బాబు, పాండువేలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలతో రీ-సర్వేలో జరిగిన తప్పులు దిద్దుబాటు

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీ-సర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకోవడం కోసమే ప్రస్తుత ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని తహసిల్దారు లోకనాథపిళ్ళై పేర్కొన్నారు. చొక్కమడుగు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సమస్యల పరిష్కార గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన తహసిల్దారు లోకనాథపిళ్ళై మాట్లాడుతూ రీ-సర్వేలో భూ యాజమానులు పేర్లు మార్పు, విస్తీర్ణంలో తేడాలు, ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు లాంటి తప్పులు జరిగాయని వీటిని సరిదిద్దుకోవడం ప్రస్తుతం ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ నవీన్, తెలుగుదేశం నాయకులు కుమార్, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## తప్పులు సరిదిద్దడానికే రెవెన్యూ గ్రామసభలు

**పాలసముద్రం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

గత ప్రభుత్వ హయంలో జరిగిన భూముల రీ-సర్వే కార్య క్రమంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికే ప్రభుత్వం ప్రస్తుతం గ్రామ సభలు నిర్వహిస్తోందని నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు, పాలసముద్రం మండలం సింహ రాజపురం గ్రామంలో మంగళవారం తహసిల్దారు అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రీ-సర్వేలో భూవిస్తీర్ణం తగ్గిపోవడం, 1బి రాకపోవడం, పట్టాదారు పాసు పుస్తకాలు తప్పిదాలు తదితరాలు ఎదైనా వుంటే వాటిని గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చి రైతులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో 15 మంది రైతులు రీ-సర్వేకి సంబంధించి సమస్యలపై ఆర్డీఓకు అర్జీలు సమర్పించారు. ఈ గ్రామసభలో తహసిల్దారు అరుణకుమారి, రీ-సర్వే డిటి ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ గణేష్, విఆర్ఓలు తంగరాజ్, శ్రీనివాసులు, వెంకటాచలం, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన తొడతర వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే

### -24 గంటల లోపు రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశం

**తవణంపల్లె, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకు పోయిన తొడతర బ్రిడ్జిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మంగళవారం ఉదయం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బహుదానదికి వరదనీరు పోటెత్తడంతో ఆనదిపై తొడతర వద్ద నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోగా అరగొండ, గాజులపల్లె, పుణ్యసముద్రం గ్రామాల వద్ద నిర్మించిన వంతెనలు దెబ్బతిన్నాయి. ఈసమాచారం అందుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, డీఈలతో కలసి ఈవంతెనలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బి డీఈ రాధిక, తహశీల్దార్ సుధాకర్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర చౌదరి, భాస్కర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ కోదండయ్య అధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించాలి

**కుప్పంరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

కుప్పం ఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించాలని వనసంరక్షణసమితి ఛైర్మన్ కనక రాజు కోరారు. మంగళవారం ఆర్టీసీ కుప్పం డిపో అసిస్టెంట్ మేనేజర్ దినేష్‌ను ఆయన కలసి ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడపాలని ఆయన కోరగా అసిస్టెంట్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమ సారథి సిఎం చంద్రబాబు

### - మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

**కుప్పంరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రైతు సంక్షేమ సారథి సిఎం చంద్రబాబునాయుడు అని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మల్లానూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిఎం చం ద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రైతుల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. రైతుల అభివృద్ధితోనే కుప్పం పురోభివృద్ధి సాధ్యమన్నారు. అధికారులకు పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించి ప్రభుత్వ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలని కోరారు. దీపావళి పండగనుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలోఎఒఅమృతవల్లి, ఉద్యానవనఅధికారి డింపుప్రియశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలు తెలుసుకోవాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

**శాంతిపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలు తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం 121 పెద్దూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. రసాయన ఎరువులైన యూరియా, డిఎపిలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు వివరించారు. పిఎం కిసాన్, రైతు భరోసా పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. డిడిఎ నాగపద్మిని అడవిపందుల దాడుల నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలమనేరు ఎడిఎ అన్నపూర్ణ దేవి మాట్లాడుతూ పంటల్లో ఎరువులు, మందుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ అప్పోజి, హెచ్ఒ వింధ్య, జెడ్‌బిఎన్‌ఎఫ్ ఫఫీ, వీణ, రాజేశ్వరి, నరసింహులు, ఆర్ఎస్‌కె ఇన్‌చార్జ్ బాలాజీ, జనసేన కిషోర్, రైతులు పాల్గొన్నారు

## పెన్షన్లు..కొళాయిలు..విద్యుత్..సోలార్ మంజూరుకు సర్వే

**శాంతిపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

కుప్పం కడ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు మండలంలో పెన్షన్లు, పక్కా గృహాలు, తాగునీటి కొళాయిలు, గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. అలాగే విద్యుత్, సౌర విద్యుత్ కనెక్షన్లకు సైతం ఈ సర్వే చేపడ్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు, విద్య, సంక్షేమ సహాయకులు గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి అర్హుల జాబితాను రూపొందిస్తారన్నారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్ బోర్డుల ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తించి నమోదు చేసుకుంటారన్నారు. ప్రజలు అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించాలని ఆయన కోరారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**రామకుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. బందార్లపల్లి పంచాయతీ లింగాపురం, కంచిదాసనపల్లి గ్రామాల్లో నూతన విఒ లీడర్లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోదండరెడ్డి, పెరుమాళ్, సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు

## కెసి ఆస్పత్రిచే 200మందికి ఉచిత వైద్య పరీక్షలు

**రామకుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త** కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ మంజునాథ్ అధ్వర్యంలో మండలంలోని ఆరిమానుపెంట గ్రామంలో వైద్యులు శిల్ప, క్రితీష్‌లు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు రెండు వందలమందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు అందించారు. ఉచితంగా ఇసిజి, బిపి, చక్కెర వ్యాధి పరీక్షలు నిర్వహించారు. కాగా కెసి ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా॥ మంజునాథ్ కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆధార్‌లో సవరణలు సరిదిద్దుకోండి : లీలా మాధవి

**చౌడేపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ఆధార్ కార్డుల్లో సవరణలుంటే సరిదిద్దుకోవాలని ఎంఎడిఓ లీలామాధవి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ కార్డుల అప్‌డేటింగ్ జరుగుతోందన్నారు. బాలాధార్ కల్గినవారు, విద్యార్థులు, ప్రజలు వారి ఆధార్ కార్డుల్లో ఏవైనా తప్పులున్న సరిదిద్దుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 22నుంచి 25వరకు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆధార్‌కార్డుల్లేని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జన్మదిన దృవీకరణ పత్రం లేని వారికి సంబంధిత అధికారులచే ఇప్పించి ఆధార్ కార్డుల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో ఇఒఆర్‌డి కృష్ణవేణి హాజరయ్యారు.

## ఐదవ విడత ఐటిఐకి దరఖాస్తులు ఆహ్వానం

**వెదురుకుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త :**

పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో చేరడంకు ఐదవ విడత ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భైరవుడు మంగళవారం తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరంలో ఐటిఐ చదవడంకు ఆశక్తిగల విద్యార్థులు అక్టోబర్ 26 సాయంత్రం 5 గంటలలోపు ఐటిఐ.ఎపీ.జిఓవి.ఇన్ వైబ్‌సెట్ నందు అప్లై చేసుకొవలెనని చెప్పారు. ప్రవేశం కొరకు ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అక్టోబర్ 27 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోను వెదురుకుప్పం ప్రాథమిక పాఠశాల ఆవరణంలోగల గర్నమెంటు ఐటిఐ, వెదురుకుప్పం నందు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. అక్టోబర్ 28 ఉదయం 10 గంటలకు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూకు వెదురుకుప్పం ప్రాథమిక పాఠశాల ఆవరణంలోగల ప్రభుత్వ ఐటిఐ నందు హాజరుకావలన్నారు. వివరాలకు మెబైయిల్ నంబర్సుకు 9533723022, 9492571731, 9533394950 సంప్రదించాలని చెప్పారు.

## ప్రజలతో మమేకమై.. సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే గురజాల

### - అడుగడుగునా హారతులతో స్వాగతం పలికిన మహిళలు

**చిత్తూరురూరల్, అక్టోబరు 22 ప్రభాతవార్త:**

మీ సమస్యలన్ని తెలుసుకొని పరిష్కరించడానికి నేను మీ వద్దకే వస్తున్నాను.. సమస్యలన్నీ తీరుస్తానంటూ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజలతో మమేకం కావడంతో స్థానిక మహిళలు ఎక్కడకక్కడ మంగళహారతులలో స్వాగతం పలికారు. మంగళవారం చిత్తూరునగరం నీవానది పరివాహక ప్రాంతమైన తేనెబండ, వీరభద్రకాలనీ, కట్టమంచి రిక్షాకాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్థానిక కాలనీవాసులతో కలసి పర్యటిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవ్వాతాతలకు సకాలంలో ఫించన్లు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. త్వరలో డ్రైనేజీ సమస్యలు లేకుండా సిమెంట్‌రోడ్లు, కల్వర్లను నగరపాలక, ఇతరశాఖల అధికారులతో మాట్లాడి నిర్మిస్తామని భరోసా కల్పించారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ఓ ముస్లీం కుటుంబం జీవనాధారం కల్పించాలనీ అర్థించగా వెంటనే ఎమ్మెల్యే వారికి దుకాణం నడిపేందుకు వీలుగా చక్రాలబండిని అందించడానికి చర్యలు తీసుకొన్నారు. అలాగే వీరభద్ర కాలనీ మహిళల కోరిక మేరకు సంక్రాంతికి తోపుడుబండ్లు అందిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్, ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

**గుడుపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలో రీసర్వేలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు శీతారాం తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మనాయనపల్లి గ్రామంలో రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆదేశాలతో రీసర్వే గ్రామాల్లో రైతులకు రీసర్వేలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈగ్రామ సభలు నిర్వహిస్తున్నామని రీసర్వేలో సమస్యలు ఉన్న రైతులు తమదృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. విస్తీర్ణం తేడాతో జాయింట్స్ ఉన్న రైతులు అర్జీలు ఇవ్వాలని సూచించారు. తిమ్మనాయనపల్లి లో 27 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రీసర్వే డిటి, మండల సర్వేయర్ రత్నప్ప, విఆర్ఓ బానుమూర్తి, సర్వేయర్లు, విఆర్ఓలు, నేతలు చెన్నప్ప, పాపన్న, మునికృష్ణ, మూర్తి, ప్రజలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రూరల్ ప్రాంతాలల్లో టిడిపి బలోపెతంకు కృషి

### - రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి

**వెంకటగిరిరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్గిందని గ్రామ స్థాయిలో టిడిపి పార్టీ బలోపెతం కోసం గ్రామ స్థాయి నాయకులు కృషి చేయాలని టిడిపి రూరల్ అధ్య క్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసి రూరల్ టిడిపి నాయకులు సమావేశంలో ఆయన మాట్లడుతూ టిడిపి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్ళలని నాయకులకు చూసించారు. అదేవిదంగా ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ చేస్తున్న అభివృద్ధి పనులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి టిడిపి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పంచాయితీల్లో స్థానికంగానే నిధులు సమకూర్చుకోవాలి

**డక్కిలి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

పంచాయితీల్లో స్థానికంగానే నిధులు సమకూర్చుకోవాలి గూడూరు డివిజన్ల్ పంచాయితీ అధికారి వెంకట రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయితీ కార్యదర్శిలతో పంచాయితీ పాలన, విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయితీల్లో శానిటేషన్, క్లోరినేషన్, మౌళిక వసతులపై తగు చర్యలు తీసుకోవాల న్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకోచ్చి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా నిధులను స్థానికంగానే సమకూర్చుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక ఇంటి పన్ను వసూళ్లలో పంచాయితీ కార్యదర్శిలు నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని వెల్లడిం చారు. పంచాయితీల్లో పనిచేస్తున్న కార్యదర్శిలు చేపలు వేలం పాటలు సకాలంలో నిర్వహించి పంచాయితీల ఆదాయ మార్గాలు పెంపోందించాలని వివరించారు. విధినిర్వహణ, పంచాయితీ పాలనలో మంచి పేరున్న డక్కిలి నేడు మరింతగా పనిచేసి తమ పనితీరును పెంచాలని తెలిపారు. డక్కిలి ఈవోపీర్డీ అల్లాభక్షు, రీసోర్స్ పర్సన్ రవి, పలు గ్రామాలకు చెందిన పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**సూళ్లూరుపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

నిరుద్యోగులకు భరోసా కల్పించి వారి సంక్షేమానికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఆయన ఇచ్చిన స్ఫూర్తితో నియోజకవర్గంలో జాబ్‌మేళా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మేనకూరు, మాంబట్టు, శ్రీసిటీ సెజ్‌లలో ఉన్న 23 పరిశ్రమల ద్వారా ఈ మెగా జాబ్ మేళా నిర్వహించి అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు నిరుద్యోగ సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. అప్పట్లోనే తాను ఎమ్మెల్యే అయితే యువతకు భరోసా ఇవ్వాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చానని తెలిపారు. జాబ్ మేళాలో 285 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**సూళ్లూరుపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని కొన్నెంబట్టు గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోను అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్కూటీపై వస్తున్న సోనుని స్టుడెంట్స్ స్పెషల్ ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సోనుని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**సూళ్లూరుపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన సాతంశెట్టి బుజ్జమ్మ, అల్లం దీపిక, మనుబోలు ధనమ్మ, బల్లి రాజారత్నం తదితరులు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 5 లక్షల 30వేల 947 రూపాయలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో వీరికి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, ఎజి కిషోర్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి అధ్యాపకునికి డాక్టరేట్

**కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కందాటి దశరథరామిరెడ్డికి అనాలసిస్ ఆఫ్ ఫెడరేటెడ్ లెర్నింగ్ అనే అంశంపై డాక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వేలూరు వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, కంప్యూటర్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ.రాజశేఖర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

## పుచ్చలపల్లిలో పాలం పిలుస్తోంది

**కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

కోట మండలం అల్లంపాడు, పుచ్చలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ అధిక దిగుబడులు పొందే పంటలు సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వరిపైరుకు తెగులు సోకినప్పుడు వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు మందులు వాడాలని కోరారు. వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని చెప్పారు. సాంకేతికతను ఎప్పటికప్పుడు ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా విఆర్ఓల వద్ద కౌలు ధ్రువపత్రాలు పొందాలని కోరారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో సబ్సిడీ పథకాలు ప్రవేశపెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## పల్లెపాలెం విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ

**తడ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

తడ మండలం పల్లెపాలెంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో 65 మంది విద్యార్థులకు మంగళవారం స్టుడెంట్ ఐడెంటిటీ కార్డులను పంపిణీ చేశారు. బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్, దేశప్పన్‌తో పాటు ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు, ఎస్ఎంసి ఛైర్మన్ రాసుభీమ్, వైస్ ఛైర్మన్ వెన్నెల, ఉపాధ్యాయులు భువనేశ్వరి, సుధాకర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు

### తహశీల్దార్ శ్రీనివాసులు

**బాలాయపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వేలో రైతులకు అన్యాయం జరిగి ఉంటే ప్రస్తుత రిసర్వేలో గ్రామ సభలో శాశ్వత పరిష్కారం చూపుతామని తహశీల్దార్ పి. శ్రీనివాసులు తెలిపారు. బాలాయపల్లి మండలం వెంకటరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సభ జరిగింది. రీ సర్వే చేపట్టిన రైతుల వివరాలు తహశీల్దార్ చదివి వినిపించారు. సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార వేదికగా గ్రామ సభను తహశీల్దార్ పి. శ్రీనివాసులు నిర్వహించారు. కొంత మంది రైతులు తమకు పాసు పుస్తకాలు రాలేదని, భూమి ఒకరి పేరు మీద ప

## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

**తిరుపతి విద్య,అక్టోబర్ 22,ప్రభాతవార్త:** స్థానిక డైరాగి పట్టెడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఐపిఎల్ బ్రాంచ్ నందు పదవ తరగతి విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. ఇండియన్ ఒలింపియాడ్ క్వాలి ఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (10 క్యుయం)ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఎగ్జామ్ లో ముగ్గురు విద్యార్థులు గల్లా వర్ష శ్రీ సాయి నిహారికి,కార్తీక్ రెండవ లెవెల్ కి సెలెక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ సగర్వంగా ఉందని తెలుపుతూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ముఖ్య అతిథిగా విద్యాసంస్థల ఏజియం సురేష్ విచ్చేసి విద్యార్థులకు పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.శ్రీ చైతన్య విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని ఏజిఎం సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ,ఐపిఎల్ ఇన్చార్జి కృష్ణ మూర్తికోఆర్డినేటర్ బాలాజీ,డీన్ చంద్రమోహన్,సి బ్యాచ్ ఇంజార్జ్ మునిరాజు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థికి సత్కారం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలో క్రీడల్లో ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిఅభినందిస్తున్నారు.ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన 14సంవత్సరాల లోపు బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంజిఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చెందిన షేక్ సనా ఫిర్దోస్ మొదటి స్థానం సాధించి అవార్డు అందుకుంది.ఇటీవల మల్కిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ ఉత్తమ ప్రతిభను కనబరచి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయటమే కాకుండా ఎంజిఎం పాఠశాలకు గుర్తింపు తెచ్చిన సబాను ఎంఎల్ఏ సత్కరించారు. క్రీడాకారులను ప్రోత్సహించుటకు పథకాలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.ఈ సన్మానంలో పలువురు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తుల సదుపాయాలకు పెద్ద పీట: అభివృద్ధికి బాట

**బొజ్జల సుధీర్‌రెడ్డి**

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నామని వారి భద్రతతో పాటు సమాచారం అందించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అభివృద్ధికి బాట వేస్తున్నామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుమారు 50లక్షలతో నిర్మించిన రెండు మరుగుదొడ్ల సముదాయాలను ఆయన ప్రారంభించారు.భక్తులకు ఆధునిక సదుపాయాలు కల్పించుటకు ఉన్న సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మహాశివ రాత్రి నాటికి ఆకర్షణీయమైన ఆధ్యాత్మిక శోభను కల్పించుటకు ఇంజనీరింగ్ అధికారులకు సూచించామన్నారు.ఎంతో కాలంగా ప్రారంభానికి నోచుకోని రెండు మరుగుదొడ్లను ప్రారంభించామన్నారు. ఆలయానికి సమీపంలో భక్తుల సదుపాయానికి నిర్మించిన విడిది షెడ్డుకు సమీపంలో నిర్మించిన రూ.34లక్షల విలువ గల్గిన మరుగుదొడ్లను అలాగే టూరిస్టుబస్టాండు ఆవరణలో నిర్మించిన మరో రూ.10లక్షల విలువ కల్గిన మరుగుదొడ్లను ప్రారంభించామన్నారు. ఇవి భక్తులకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. అయితే ఇంజనీరింగ్ అధికారులు వీటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని సుధీర్‌రెడ్డి సూచించారు. శ్రీకాళహస్తిలో ప్రధాన కేంద్రాలైన రైల్వేస్టేషన్,ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఆధునిక సదుపాయాలతో టాయిలెట్స్‌ను అలాగే స్నానపు గదులను, నిర్మించనున్నట్లు వివరించారు. పానగల్‌లోని దేవస్థానం ఆర్చి నుంచి జలవినాయక ఆలయం వరకు ఫుట్ పాత్‌లను నిర్మించుటకు సూచించామన్నారు.పట్టణంలో అడుగుపెడితే విద్యుత్ దీపాల వెలుగులతో కళ కళ లాడుతూ మనం ఎక్కడ ఉన్నామనే అనుభూతి కలిగేలా తీర్చి దిద్దాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎంఎల్ఏ సూచించారు.రానున్న కార్తీక మాసంలో స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగించుకొనుటకు వడ్డున తగిన ఏర్పాట్లు చేయిస్తామన్నారు. ఆలయ ఇఇ మురళీధర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## అక్రమ కేసును కొట్టేసిన కోర్టు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి నియోజకవర్గంను ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా నాయకుడు రాజకీయంగా తమను ఎదుర్కొనలేక అక్రమకేసులు బనాయించి ఇబ్బంది పెట్టారని అయితే సత్యమేవ జయతే అన్నట్లు కేసును విచారించిన చిత్తూరు జడ్జి ఎఫ్ఐఆర్ 58/2022 రేణిగుంట అర్బన్ పోలీసుస్టేషన్) కొట్టివేసారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట మంగళవారం పత్రికల వారికి వివరించారు. ఐదేళ్ళ పాటు పరిపాలించిన బియ్యపు మధుసూధనరెడ్డి కక్ష సాధింపుగా పోలీసులను ఉపయోగించుకొని తమపై 17 అక్రమ కేసులను బనాయించారని వివరించారు. మహిళ అని కూడా గమనించక మాజీ ఎంఎల్ఏ తమ ప్రతాపాన్ని పోలీసుల ద్వారా ప్రదర్శించారన్నారు.

## కలెక్టర్‌ను కలసిన ఎస్‌సివి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌ను కలసి పూలబొకేను అందించారు.ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు కలెక్టర్‌కు శ్రీకాళహస్తిలో అభివృద్ధి పథకాలకు సంబంధించి చర్చించారు. రాజీవ్‌నగర్ లో ఐదేళ్ళ పాటు సాగిన భూ దందాలపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. 2007లో తాను శాసనసభ్యుడుగా ఉన్నపుడు ఏడువేల మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించామని అయితే నిరుపేదలు అక్కడ ఇళ్ళు నిర్మించుకోనందువల్ల ఆక్రమణలకు గురయ్యాయని వివరించారు

## సకాలంలో పన్నులు చెల్లించి సహకరించండి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ బి.గిరికుమార్ మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి సుమారు 27 కిలో మీటర్లుందని ఇక్కడ అభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటిపన్నులు, కొళాయిపన్నులు,ఖాళీ జాగా పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. ఇక కొందరు కాంట్రాక్టర్లు మార్కెట్ లీజులు, షాపు రూము బాడుగలు సకాలంలో చెల్లించటం లేదని దాని వల్ల పెనాల్టి పడుతుందని ఆ వాతావరణం నుంచి కాపాడుకోవాలని కమిషనర్ గిరికుమార్ తెలిపారు.గతంలో కూడా కొందరు పన్నులు సకాలంలో చెల్లించక బకాయిలు పేరుకుపోయాయన్నారు.

## ఘనంగా మయూర్ పుట్టినరోజు వేడుకలు

**-గ్రామంలో అన్నదానం**

**.తొట్టంబేడు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ఎంజిఎం విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ పుట్టినరోజు వేడుకలు మండలంలోని లింగమనాయుడు గ్రామంలో మంగళవారం గ్రామ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భారీకేక్‌ను ఆయన చేత కటౌచేయించి దుశ్శాలువతో సత్కరించడంతో పాటు స్వీటు పంపిణీచేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా విద్య, వైద్యాన్ని కార్పొరేట్ స్థాయిలో పేదలకు అందిస్తు మయూర్ మరింత ఉన్నత స్థాయికి చేరాలని యువత ఆకాంక్షించారు. సొంత గ్రామమైన లింగమనాయుడుపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొపాల్పరత్నశేఖర్, అంకయ్య, గంధం సురేష్, గంధం అరవింద్, గంధం చంద్ర, కొప్పాలసతీష్, కొప్పాల మహేష్, రోననూరు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై వ్యతిరేక మెసేజ్‌లు పెడితే చర్యలు

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ప్రభుత్వం, పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వ్యాఖ్యలు చేసిన శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు ఎగువవీధికి చెందిన సుబ్రమణ్యంరెడ్డిపై చట్టపరమైన చర్యలు చేపట్టామని డిఎస్‌పి నరసింహమూర్తి తెలిపారు. సుబ్రమణ్యంను డిఎస్పీ కార్యాలయంకు పిలిపించి నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నీటి వృథాను అరికట్టండి

**కేవీబీ పురం, అక్టోబరు 22 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని సదాశివపురం గ్రామంలో ఏరులై పారుతున్న తాగునీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా... సదాశివపురం దళితవాడలో తాగునీటి కొరకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ల ద్వారా గత పది రోజులుగా ఏరులై పారుతున్న నీటి వృథాను అరికట్టే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది అటువైపే వెళుతున్నా చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆదర్శ పంచాయితీగా అభివృద్ధి చేసుకుందాం

**తిరుచానూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త** తిరుచానూరు పంచాయితీని ఆదర్శ పంచాయితీగా అభివృద్ధి చేసుకుందామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయితీ ఈవో మాధురి తెలియజేశారు. గతంలో తిరుపతి రూరల్ మండల ఈఓ పిఆర్డిగా బాధ్యతలు నిర్వహించారు. ఇదే క్రమంలో తిరుచానూరు పంచాయితీ కార్యనిర్వాహణ అధికారిగా సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు, పారిశుద్ధ్య, వీధి దీపాలు ఇతర పంచాయితీ సమస్యలు ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని గ్రామ ప్రజలకు తెలియజేశారు. గ్రామ పంచాయితీ సంబంధిత భూమి ఆక్రమణలు గురికాకుండా సంరక్షిస్తానని అన్నారు. పంచాయితీ నిధులు దుర్వినియోగం కాకుండా పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. పంచాయితీ పన్నులను సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి తమ సహకారం అందించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఏజీపీకి సత్కారం

**నగరి, అక్టోబరు 22 ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన ఏజీపీ ఎం.జె.జగదీషన్‌ను నగరి బార్ అసోసియేషన్ సభ్యులు బార్ ఉపాధ్యక్షుడు ఇ.జి.బాబు, సహ కార్యదర్శి అరుల్ ఆధ్వర్యంలో సత్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలో జగదీష్‌ను కలసిన వారు శాలువలతో, పూలదండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.సుబ్రహ్మణ్యం, ఎన్.మహదేవన్, కె.వేలాయుధం, రాము, ధరణి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిసి రాయులు ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి జన్మదిన వేడుకలు

**తిరుపతి విద్య,అక్టోబర్ 22,ప్రభాతవార్త:**

స్థానిక గాంధీ రోడ్‌లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డా పీసీ రాయులు ఆధ్వర్యంలో భారత దేశ యూనియన్ హోంమంత్రి అమిత్ షా 60వ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు జి భాను ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు.ట్రస్ట్ చైర్మన్ డా.పి సి రాయులు మాట్లాడుతూ యూనియన్ హోంమంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ తిరుపతి ఆధ్వర్యంలో జరుపుకోవడం చాలా సంతోషకరమని తెలియజేస్తూ,దేశ ప్రధాని నరేంద్ర మోడీ అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కృష్ణార్థుల్లాగా చేదోడు వాదోడుగా ఉంటూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని,అనేక క్లిష్ట తరమైన సమస్యలన్ని పరిష్కరిస్తూ దేశానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్తున్నారని,ఆ భగవంతుడు వారికి మంచి ఆయురారోగ్యాలు కలుగజేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ మునిరత్నం నాయుడు,బండి మధుసూదన రెడ్డి,ఎం ఉమాపతి,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

**తిరుపతి విద్య,అక్టోబర్ 22,ప్రభాతవార్త:**

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మదన మోహన్ మాలవీయ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా 17-10-2024 నుండి 22-10-2024 గత వారం రోజులుగా జరుగుతున్న అప్లికేషన్స్ ఆఫ్ ఐ.కె.ఎస్ ఇన్ సాంస్కిట్ టెక్స్ట్ అండ్ ఇట్స్ కాంటెంప్రరీ రిలవెన్స్ అనే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సమాపన సమారోహం విశ్వవిద్యాలయ రమారంజన్ ముఖర్జీ సభాభవనం నందు జరిగినది.అనంతరం మదనమోహన్ మాలవీయ సెంటర్ డైరెక్టర్ ప్రొ.ఎస్ మురళీధర్ రావు మాట్లాడుతూ మదన్మోహన్ మాలవీయ సెంటర్ అనేటువంటిది అధ్యాపకులు కొత్త నైపుణ్యాలను పెంపొందించడానికి నిర్దేశించబడిని ఒక ఉత్తమ కేంద్రం అని,అందరూ కూడా ఈ కేంద్రంలోని వివిధ కోర్సులు చేసి,మంచి జ్ఞానాన్ని,మెలకువలు సంపాదించుకోవచ్చని,అధ్యాపకులకు ప్రత్యేకించి విభిన్న విషయాల పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమానికి డా.ఎ చారుకేష్ వర్సిటీలోని అధ్యాపకులు,వర్సిటీ నుంచి విచ్చేసినటువంటి 35 పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఫెస్టివ్ ఎడిషన్ పరిచయంపై టొయోటా కిర్లోస్కర్ మోటార్

**తిరుపతి విద్య,అక్టోబర్ 22,ప్రభాతవార్త:**

కార్ల కొనుగోలుదారుల కోసం ఈ పండుగ సీజన్‌ను ప్రత్యేకంగా మలస్తూ టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) మంగళవారం టొయోటా రూమియన్ యొక్క ఫెస్టీవ్ ఎడిషన్‌ను పరిచయం చేసింది. ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీ ప్యాకేజీలను కలిగి ఉన్న ఈ లిమిటెడ్-ఎడిషన్ సీజన్‌ను చక్కగా మరియు ఆకర్షణీయమైన శైలిలో జరుపుకోవడానికి సరైన మొబిలిటీ ఎంపికగా నిలుస్తుంది.ఫెస్టీవ్ ఎడిషన్ పరిచయం పై టొయోటా కిర్లోస్కర్ మోటార్,సేల్స్ -సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ,మా కస్టమర్లకు అసాధారణమైన విలువను అందించాలనే మా నిబద్ధత లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్ ను ప్రీమియం యాక్సెసరీలు,అత్యుత్తమ విక్రయానంతర సేవలతో పాటుగా పొడిగించిన వారంటీలతో అందిస్తున్నాము అని ఇవన్నీ భారతీయ కొనుగోలుదారుల ప్రత్యేక అవసరాలను తీర్చిడానికి ఖచ్చితంగా రూపొందించబడ్డాయి అని అన్నారు.

## జనసేన నేతలపై నమోదైన కేసు కొట్టివేత

**రేణిగుంట, అక్టోబరు 22 ప్రభాతవార్త:**

జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబుపై నమోదైన కేసును చిత్తూరు జిల్లా న్యాయస్థానం కొట్టివేసిందని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 2022వ సంవత్సరం రేణిగుంట అర్బన్ పోలీసులు(ఎఫ్ఐఆర్ 58/2022) కేసు నమోదు చేశారని ప్రకటనలో తెలిపారు. కేసు విచారణ పూర్తయిన తరువాత న్యాయమూర్తి కేసును కొట్టివేశారని ప్రకటనలో పేర్కొన్నారు.

## టిటిడి రిటైర్డ్ హెల్త్ ఆఫీసర్ భీష్మయ్య నాయుడు మృతి

**చంద్రగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

టిటిడిలో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి విశ్రాంత జీవితం గడుపుతున్న భీష్మయ్య నాయుడు మృతికి ఎంఎల్ఏ పులివర్తి నాని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని శేషాపురంకు చెందిన భీష్మయ్య నాయుడు ఆరోగ్య అధికారిగా టిటిడిలో పనిచేశారు. ఆయన అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంఎల్ఏ ఇక్కడికి చేరుకుని భీష్మయ్య నాయుడు భౌతిక కాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, వీరంగారి రమేష్ రెడ్డి, సక్కార్ ధనంజయ రెడ్డి, గుర్రప్ప నాయుడు, బిజెపి నాయకుడు రాజేంద్ర నాయుడు, తదితరులు వున్నారు.

**చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నివాళి**

టిటిడిలో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్న భీష్మయ్య నాయుడు అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మంగళవారం శేషాపురం చేరుకుని నివాళులర్పించారు. సినీనటుడు రఘుబాబు ఆయన వెంట రాగా ఇరువురు భీష్మయ్య నాయుడు భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో తనకు గల అనుంబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

## రైతులు ఆధునిక పద్ధతులను అవలంభించాలి..!

**రామచంద్రాపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

రైతులు ఆధునిక పద్ధతులను అవలంభించి అధిక పంట దిగుబడులను పొందాలని ఏఓ స్రవంతి అన్నారు. మంగళవారం నెత్తకుప్పం, అనుప్పల్లి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. డ్రిప్ పరికరాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించడం జరుగుతుందని అన్నారు. ఉద్యానవన శాఖ అధికారి సునీల్ మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను అందిస్తుందన్నారు. పామాయిల్ సాగుపై రైతులు మొగ్గుచూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి హేమకుమార్, మాజీ ఎంపిపి బింధుమాదవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ భరత్, వెటర్నరీ అసిస్టెంట్ కవిత, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించండి..!

**ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ వినతి**

**చంద్రగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ మంగళవారం ఎంఈఓ శ్రీవరం లలితకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణారెడ్డి శ్రీ చైతన్య స్కూల్, శ్రీచైతన్య టెక్నో స్కూల్, బ్లూమింటగ్ బడ్స్ ఈఎం స్కూల్, కళ్యాణీ ఈఎం స్కూల్, అక్షర్‌ధాం ఈఎం స్కూల్ వంటి ఇతర ప్రైవేటు స్కూల్స్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలలో ఏపి జీఓ నంబర్ 1 ప్రకారం నిబంధనలు పాటించడం లేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కనీస మౌళిక వసతులు లేవనీ, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుని వెంటనేసమస్యలనుపరిష్కరించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ నాయకుడు కుంచ రెడ్డి వున్నారు.

## రోడ్డు విస్తరణ భూ నిర్వాశితులకు న్యాయం చేయండి..!

**ముంగిలిపట్టు, కాశిపెంట్ల, పనపాకంలో ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి..!**

**ఎంఎల్ఏ పులివర్తి నాని చిత్తూరు జెసి విద్యాధరికి వినతి**

**చంద్రగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

చంద్రగిరి మండలం, జాతీయ రహదారి విస్తరణలో భూ నిర్వాశితులకు తగిన న్యాయ ం చేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని చిత్తూరు జెసి విద్యాధరిని కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం 1956 జాతీయ రహదారుల చట్టం 3జి (4) నోటిఫికేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి చేరుకున్న ఎంఎల్ఏ జాతీయ రహదారి విస్తరణలో రోడ్డుకు ఇరువైపులా గల కాలువలు అంతరించిపోయినట్లు జెసి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వర్షాలకు వరదలు పంటపొలాలను ముంచెత్తుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కుక్కలపల్లి-మల్లవరం 6 లైన్ల ఎన్‌హెచ్ 140లో చెక్ డ్యామ్‌లు, కాలువలు నిర్మించేందుకు మరోమారు భూసేకరణ చేపడుతున్నట్లు వివరించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పనపాకం వద్ద 80 మంది తమ ఇళ్ళను కోల్పోయినట్లు జెసి దృష్టికి తీసుకువచ్చారు. ముంగిళిపట్టు, కాశిపెంట్ల, పనపాకం నిర్వాశితులకు 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాల్సి వున్నప్పటికీ ఆమేరకు న్యాయం జరగలేదన్నారు. ఏ.రంగంపేట వద్ద, పనపాకం వద్ద గల ఫ్లైఓవర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, వీరంగారి రమేష్‌రెడ్డి, దేవర మనోహర్, రైతులు, భూనిర్వాతులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మోదీ, అమిత్‌షాల నాయకత్వం దేశానికి ఎంతో అవసరం

**రేణిగుంట, అక్టోబరు 22 ప్రభాతవార్త:** నాటి కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మాన్ని గెలిపించిన కృష్ణార్జునల మాదిరి భారత ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లాంటినేతలు ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ఎంతో అవసరమని బీజేపీ యువ నాయకుడు వెంకటాద్రి యాదవ్ అన్నారు. భారత హోంశాఖ మంత్రి అమిత్‌షా పుట్టిన రోజు సందర్భంగా రేణిగుంట మండలం కృష్ణాపురం పంచాయతీ డి.మల్లవరం, ఎల్ఎన్ కండ్రిగ గ్రామాల్లో తిరుపతికేంద్ర హోమియో ఆరోగ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్, బీజేపీ నాయకులు బొబ్బిలిరెడ్డి పర్యవేక్షణలో ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం మంగళవారం జరిగింది. విశేష సంఖ్యలో ప్రజలు వైద్య శిబిరానికి వచ్చారు. వైద్యులు వరప్రసాద్, హారిక, సెల్వి, తదితర వైద్య బృందం శిబిరానికి వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రవిచంద్రరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం

**రేణిగుంట, అక్టోబరు 22 ప్రభాతవార్త:**

రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో రేణిగుంట మండలం వెంకటాపురంలో రాస్‌ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆదేశాలతో పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు సూచనల మేరకు మంగళవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్స్‌ట్రస్టు ద్వారా ఉచిత మెగా పశు వైద్యశిబిరం జరిగింది. శిబిరానికి వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ పశువులను తీసుకొచ్చారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్యులు అనూష బృందం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్యంగా పశువుల కడుపులోని క్రిములుచనిపోవడానికి పురుగుల మందు తాగించారు. పిడుదులు రాకుండా ఉండడానికి నివారణ మందులను పిచికారి చేశారు. కార్యక్రమంలో గిరిప్రసాద్, అన్బగలన్, శంకరయ్య, నాగమణి, ఇంధుమతి, జ్యోతి, స్వాతి, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

## వార్తకు స్పందన

**పాకాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

**వార్త కథనం పై స్పందించిన కాంట్రాక్టర్**

మండల కేంద్రంలో టెలిఫోన్ కేబుల్ ఏర్పాటు కొరకు తవ్వి వదిలేసిన గోతులను పూడ్చమని వార్త పత్రికలో సోమవారం వచ్చిన కథనానికి వెంటనే స్పందించిన కేబుల్ కాంట్రాక్టర్ జగదీష్ చౌదరి తవ్విన గోతులను జెసిబి సహాయంతో వెంటనే పూడ్చి వేసారు. దీనిపై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వెలుగు పూల కోసం పుస్తకావిష్కరణ

**పాకాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ రమేష్ కుమార్ రచించిన వెలుగు పూల కోసం కవితా సంపుటిని కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మోహిద్దిన్ భాష మంగళవారం ఆవిష్కరించారు

# అతివేగంపై ఫాల్కన్ కన్ను

## ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు - ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో అతివేగంగా నడిచే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఫాల్కన్ నిఘా పెట్టనుంది. చిత్తూరు నగర పరిధిలో ఫాల్కన్ వాహనం ద్వారా ప్రత్యక్షంగా మాత్రమే కాకుండా పరోక్షంగా నిఘా పెట్టి ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం జరుగుతుందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనపై కేవలం నేరుగా కాకుండా జిల్లాలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిఘా వుంచి జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్ లేదా సరైన పత్రాలు లేని వాహనాలు, వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపడం వంటి ప్రమాదకరమైన చర్యలను ఎట్టి పరిస్థితుల్లోను సహించబోమని స్పష్టం చేశారు. ఫాల్కన్ వాహనంలో వున్న కెమెరాలు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడానికి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా అమలు చేయడం కంటే ప్రజల భద్రతను పెంచడంలో ఇది ఒక కీలక సాధనంగా నిలుస్తోందన్నారు. అలాగే ఫాల్కన్ వాహనం ఉపయోగించడం ద్వారా సరైన దిశలో అనుమానస్పద వ్యక్తులను గుర్తించి సమర్థవంతంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫాల్కన్ వాహనం ద్వారా ప్రజల రక్షణను కాపాడటంతో పాటు సమాజంలో సురక్షితమైన వాతావరణంను కల్పించడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిసి కెమెరాల ద్వారా ప్రతి వ్యక్తి కదలికలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, ఎవరైతే మైనర్లకు వాహనాలు ఇస్తారో వారే శిక్షించబడుతారని, అలాగే ట్రిపుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్ ప్రమాదమని ఇది మీ జీవితాలకు ముప్పు కల్గిస్తాయని హెచ్చరించారు. చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తూ ఎవరైనా కన్పిస్తే వారు నడుపుతున్న వాహన నెంబర్ ప్లేట్ కన్పించే విధంగా ఫోటో లేదా వీడియోను ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నెంబర్ 94910 74515కు పంపాలని, పంపిన వారి వివరాలు గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు.

ఫాల్కన్ వాహనం నుండి చిత్తూరు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్

## కంచిమఠం పీఠాధిపతి ఆశీస్సులందుకున్న టిటిడి ఈఓ దంపతులు

తిరుమల, అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:

కంచికామకోటిమఠం పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిస్వామిని మంగళవారం సాయంత్రం టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతిలోని వినాయకనగం క్వార్టర్స్‌లో ఉన్న కంచి మఠంలో స్వామి వేంచేయడంతో ఈఓ కలిసి పండ్లు, పుష్పాలు సమర్పించుకున్నారు. టిటిడిలో లడ్డూల నాణ్యత మెరుగుపరచడం, నాణ్యతతో ఉన్న నెయ్యిని సరఫరా చేసుకోవడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం వంటివాటిని విజయేంద్రసరస్వతి స్వామి తెలుసుకుని ఈఓను అభినందించారు. సేవాభావంతో, ధర్మనిరతితో సేవలందించాలని స్వామి సూచించారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం 27 సమస్యలు అందాయి. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలలు తమ సమస్యలను ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి తీసుకెళ్ళగా వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూతగదాలకు సంబంధించి 8, ఆర్థిక లావాదేవిలు 6, కుటుంబ తగాదాలు 5, ఇంటి సమస్యలు 3, ఆస్తి తగాదాలు 3, వేధింపులు, చీటింగ్‌లకు సంబంధించి ఒకొక్క ఫిర్యాదు అందాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్ పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో బిజెపి కేంద్ర కార్యదర్శి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి మహేంద్ర పాండే కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితుల ఆశీర్వచనంతో పాటు స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## భూమి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

### గంజి మాధవయ్య

పుత్తూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త :

గ్రామాల్లో భూముల సమస్యలకు సంబం ధించి పరిష్కారానికి రెవెన్యూ శాఖాధికారులు చొరవ చూపించాలని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ గంజి మాధవయ్య తెలిపారు. ప్రభుత్వ రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం మంగళవారం తహశీల్దారు జె.సి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గొల్లపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత వైసిపి ప్రభుత్వం రీసర్వే పేరుతో రైతులను గందరగోళానికి గురి చేసిందని ఆరోపిం చారు. ఎటువంటి రీ సర్వే చేయకపోయినా చేసినట్టుగా రికార్డులు తారుమారు చేసేశారని విమర్శించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో రైతుల నుంచి సక్రమంగా దరఖాస్తులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఐఒఎస్ కృపాకర్, మండల సర్వేయర్ శేషమరాజు, మాజీ ఎంపిటిసి కోట గజపతి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముగ్గురు చిన్నారుల కోసం ఇద్దరు అంగన్వాడీ సిబ్బంది

బాలాయపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారుల భవిష్యత్తు, పరిపుష్టి కోసం పౌష్టికాహారాన్ని ఇచ్చేందుకు నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు కనబడటం లేదు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాల పనితీరు సక్రమంగా లేదని చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వాపోతున్నారు. సూపర్వైజర్లు పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో అంగన్వాడి కేంద్రాలు అభివృద్ధి లేక కుంటుపడుతున్నాయి. బాలాయపల్లి మండలం వెంకటరెడ్డి పల్లి మెయిన్ అంగన్‌వాడి కేంద్రంలో కేవలం ముగ్గురు చిన్నారులు మాత్రమే ఉండడం గమనార్హం. రికార్డుల్లో మాత్రం ఎక్కువమంది చిన్నారులను, బాలింతలను, గర్భవతులను చూపించి సరుకులు తీసుకుంటున్నారు. కేంద్రంలో మాత్రం ఉండవల్సిన చిన్నారులు కనిపించడం లేదు. ముగ్గురు చిన్నారుల కోసం సిబ్బందిగా ఒక కార్యకర్త, ఒక ఆయా మొత్తం ఇద్దరు పనిచేస్తున్నారు. వేలాది రూపాయిలు జీతాలు తీసుకుంటున్న జీతాలు చాలడం లేదని రోడ్డెక్కుతున్నారు. ఇకనుంచైనా కేంద్రాల సంఖ్య పెంచాలని, ఉన్న చిన్నారులను తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఆర్టీసి ఉద్యోగులు ఇద్దరికి మెడికల్ ఇన్వ్యాలిడేషన్ కేసులను ఆమోదించిన కమిటీ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

ఆర్టీసికి చెందిన ఇద్దరు ఉద్యోగుల మెడికల్ ఇన్వ్యాలిడేషన్ కేసులను కమిటీ ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసికి సంబంధించిన ఇద్దరు ఉద్యోగులు ఒకరు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఉద్యోగి, మరొకరు పక్షవాతంతో నడవలేని పరిస్థితిలో ఉన్న కేసుకు సంబంధించిన ఉద్యోగులను పరిశీలించి మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రతిపాదనలను మెడికల్ ఇన్వ్యాలిడేషన్ కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జి అధికారి జగదీష్, కలెక్టరేట్ ఎ.ఓ భారతి, సెక్షన్ డిటి ఉషారాణి పాల్గొన్నారు.

## మల్లప్పకొండలో పర్వతారోహకుల పోటీలు ప్రారంభం

### - కుప్పంలో తొలిసారి బైక్ రైడర్ల హంగామా !!

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో తొలిసారి పర్వతారోహకుల పోటీలు (బైక్ రైడర్స్) హంగామా మొదలైంది. నియోజకవర్గంలో మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి చెందుతున్న గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరాలయంకు వెళ్లే ఆహ్లాదకర కొండ ప్రాంతంలో మూడు రోజుల పాటు జరిగే పర్వతారోహకుల పోటీలను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. డస్ట్ టు క్లౌడ్స్ సంస్థ, కడ సంయుక్తంగా ఈపోటీలను నిర్వహిస్తోంది. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్ర ప్రాంతాలనుంచి వచ్చిన బైక్ రైడర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ బైక్ రైడింగ్ పోటీలను తిలకించేందుకు యువత అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాల్లో సంస్థ ప్రతినిధి నాగ చైతన్య, మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు హేమాంబరగౌడు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి చీగలపల్లిలో ఉన్న క్వారీలో బండరాయి మీదపడి మృతి చెందిన వేణుగోపాల్ కుటుంబాన్ని ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పరామర్శించారు. మంగళవారం కనమనపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు బాధితులను ఆయన పరామర్శించారు. బాధితులకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకు కూల్చివేత

పాలసముద్రం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీ రేణుకాపురం ఎఎడబ్ల్యు గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత మంచినీటి ట్యాంకును మంగళవారం సర్పంచ్ అనురేఖ మడివాడన్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. రేణుకాపురం ఎఎడబ్ల్యుకు ఇప్పటి వరకు శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకు ద్వారానే నీరు సరఫరా అవుతుంది. వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ట్యాంకు పెచ్చులు ఊడి ట్యాంకు అడుగు భాగంలో పడుతున్నప్పటికీ ఎవరు స్పందించలేదు. ఈ విషయంను గ్రామస్తులు సర్పంచ్ అనురేఖ మడివాడన్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆమె ఈ విషయంను ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు దృష్టికి తీసుకెళ్ళారు. అయితే నిధుల కొరత వుండటంతో ట్యాంకు కూల్చివేయడం, నూతన ట్యాంకు నిర్మించడంలో జాప్యం జరుగుతుందని ఇది వరకు ఇన్‌ఛార్జీ ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న విద్యావతి స్పష్టం చేశారు. దీనిపై సర్పంచ్ తాను సొంత నిధులతో ట్యాంకు నిర్మాణం చేపడ్తానని పేర్కొనడంతో మంగళవారం సర్పంచ్ అనురేఖ మడివాడన్, ఇఓఆర్డీ రమేష్‌బాబుల ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేనిన నీటి ట్యాంకును జెసిబి సహాయంతో కూల్చివేశారు. కొత్త ట్యాంకు నిర్మించే వారకు బోరు పైపు లైనుకు డైరెక్ట్ కనెక్షన్ ఇచ్చి గ్రామానికిమంచినీరు సరఫరా చేశారు. గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారం కావడంతో సర్పంచ్ అనురేఖ మడివాడన్‌ను గ్రామస్తులు అభినందించారు.

## ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలసిన జెడ్పీ సిఈఓ

పలమనేరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త:

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని చిత్తూరు జిల్లా జెడ్పీ సిఈఓ రవికుమార్ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ మేరకు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు చేపట్టవలసిన కార్యచరణపై ఎమ్మెల్యే సిఈఓతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**శివాలయం హుండీ ఆదాయం రూ.2.20లక్షలు**

పలమనేరులోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,20,618 వచ్చినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ మేరకు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,20,618, సత్య గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1,02,197 వచ్చినట్లు ఈ నగదును ఆలయ ఖాతాలో జమ చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు.

# వేధింపుల వల్లే గిరిజనుడు కృష్ణయ్య ఆత్మహత్య

## రొయ్యలగుంటల యజమానిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలి

## యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య డిమాండ్

చిట్టమూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో రొయ్యలగుంటల యజమాని రెహమాన్ వేధింపుల వల్లనే గిరిజనుడు చెంచుకృష్ణయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య అన్నారు. రొయ్యలగుంటల యజమానిపై అధికారులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో రొయ్యలగుంటల యజమాని రెహమాన్ వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న తుపాకుల చెంచుకృష్ణయ్య కుటుంబాన్ని మంగళవారం యానాదుల సంక్షేమ సంఘం బృందం గూడూరు నర్సింగరావుపేటలోని ఆయన నివాసంలో పరామర్శించి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెహమాన్ వేధింపుల కారణంగానే చెంచుకృష్ణయ్య ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన భార్య మునెమ్మ బోరున విలపించింది. ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని పోలీసులకు తెలియజేయకుండా హడావుడిగా ఆటోలో మృతదేహాన్ని తరలించి దహన సంస్కారాలు ఎందుకు చేయాల్సి వచ్చిందని వారు ప్రశ్నించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం బృందం డిమాండ్ చేసింది. చెంచుకృష్ణయ్య ఆత్మహత్యతో అతని భార్య, నలుగురు పిల్లలు అనాథలు అయ్యారని, జిల్లా అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన 'వార్త'కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జున, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా, ఆర్గనైజింగ్ సెక్రటరి ఇండ్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ వ్యవస్థకు జాతీయ అవార్డు అందుకున్న తిరుపతి ఐఐటి

కేంద్ర జలవనరుల శాఖ మంత్రిచే అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ సత్యనారాయణ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

తిరుపతి ఐఐటి రూపొందించిన నీటి సంరక్షణ వ్యవస్థకు జాతీయ స్థాయిలో వాటర్ అవార్డు 2023ని మంగళవారం అందుకున్నారు. జలశక్తి కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ చే అందుకున్నారు. స్వల్ప కాలంలో తిరుపతి ఐఐటి ఎన్నో ప్రయోగాలను అందిస్తూ సామాజిక కార్యక్రమాల్లో ప్రశంసలందుకుంటూ రాష్ట్ర జాతీయ స్థాయిలో అవార్డుల పంటను పండిస్తున్నారు. డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ సారధ్యంలో తిరుపతి ఐఐటి అవార్డు పంటను అందుకుంటున్నారు. ఈనేపథ్యంలో తిరుపతి ఐఐటి 'నీటి సంరక్షణ వ్యవస్థను' రూపొందించారు. ఇది గ్రామీణాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఐదు జాతీయ జలవనరుల అవార్డులను 2023 అని ప్రకటించారు. తొమ్మిది విభాగాల్లో 38 మందికి విజేత అవార్డులను అందజేసారు. ఉత్తమ రాష్ట్రం, ఉత్తమ జిల్లా, ఉత్తమ గ్రామ పంచాయతి, ఉత్తమ పట్టణం స్థానిక సంస్థ, ఉత్తమ నీటి వినియోగదారుల సంఘం, ఉత్తమ సంస్థ ఉత్తమ పౌర సమాజం అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన నేషనల్ వాటర్ అవార్డు 2023లో తిరుపతి ఐఐటికి ఉత్తమ సంస్థల విభాగంలో ప్రత్యేక ప్రస్తావన అవార్డు లభించింది. ఈ అవార్డు గురించి డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ గుర్తింపు తన క్యాంపస్‌లోని సిబ్బంది, విద్యార్థుల్లో జోష్ నింపిందన్నారు. ఈ గుర్తింపు తన క్యాంపస్‌లో ఒక ఆదర్శవంతమైన నీటి సంరక్షణ వ్యవస్థను అమలు చేయటంలో విశేష ప్రయత్నాలను గుర్తించిందన్నారు. ఈ సందర్భంగా ఐఐటి క్యాంపస్‌లో సంబరాలు జరుపుకున్నారు. న్యూఢిల్లిలో అవార్డు, అమరావతిలో చంద్రబాబు నాయుడుతో డ్రోన్ కాన్ఫరెన్సులో ఒప్పందం ఎనలేని విజయాలని డైరెక్టర్ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

# మానవ వనరుల మ్యాపింగ్ ద్వారా యువతకు ఉపాధి

## జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

జిల్లాలోని పాలిటెక్నిక్ డిప్లోమా, ఐటిఐ కాలేజీలలో, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలో కోర్సు పూర్తి చేసుకుంటున్న వారికి వారి ప్రాంతాలకు దగ్గరల్లోని పరిశ్రమలను గుర్తించి వాటికి అవసరమైన మానవ వనరులను అందించేలా యువతకు ఉపాధి కల్పించేలా ఉండాలని, సదరు మ్యాపింగ్ పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ, మెప్మ, డిఆర్‌డిఎ, పాలిటెక్నిక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ తదితర అధికారులతో జెసి శుభం బన్సల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ద్వారా నైపుణ్యం పొందిన వారికి, ఐటిఐ, పాలిటెక్నిక్‌ల ద్వారా కోర్సులు పూర్తి చేసుకున్న యువతకు వాటి సమీపంలోని పరిశ్రమలలో మానవ వనరులు, సాంకేతిక నిపుణుల అవసరతను గుర్తించి ఆ మేరకు కోర్సులలో శిక్షణ పొందిన వారికి సదరు పరిశ్రమలలో ఉపాది కల్పించే విధంగా మ్యాపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఒక కమిటీ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇంచార్జి అధికారి, పథక సంచాలకులు డిఆర్‌డిఏ శోభన్ బాబు, మెప్మా రాధమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

## -మండలంలో అభివృద్ధి పనులకు రూ.3.91 కోట్లు మంజూరు

## గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని... గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశం ప్రగతిపథంలో ముందుకు వెళ్ళుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. 'పల్లే పండగ-వారోత్సవాలలలో భాగంగా మంగళవారం మంగళం ఉమ్మడి పంచాయతీలలో మౌళిక వసతుల రూపకల్పనతో పాటు గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 'పల్లే పండగ-ప్రగతికి అండగా పంచాయతీ వారోత్సవాలు" రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైనట్లు తెలిపారు. రూ.4వేల 500 కోట్ల రుపాయాల నిధులతో 30వేల అభివృద్ధి పనులు చేపట్టిందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. గత వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గత ఎమ్మెల్యే 10సంవత్సరాలు చేయలేని పనులను తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగు నెలలు కాలంలో పూర్తి చేసామని ఎమ్మెల్యే నాని స్పష్టం చేసారు. తిరుపతి అర్బన్ మండలం ఉమ్మడి మంగళం పంచాయతీలో రూ.50లక్షల జడ్పి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మండల పరిధిలోని తిరుమలనగర్, ఉమ్మడి మంగళం, రణధీరపురం, లింగేశ్వరనగర్, అవిలాల, తిరుచానూరు పంచాయతీలలో 47 హ్యాబిటేషన్‌లకు గాను రూ.3కోట్ల 91లక్షల 60వేల రుపాయాలు గ్రామాలకు మంజూరైనట్లు తెలిపారు. కొత్త సిమెంట్ రోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేసారు. ప్రజలకు అవసరమయ్యే 30వేల పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్ర, తిరుపతిఅర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మీ, టిడిపి రూరల్ అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, పుదిపట్ల సర్పంచ్ బడి సుధాయాదవ్, టిడిపి నాయకులు అలిమినేని మధు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయం తరపున గంగమ్మకు పూజలు

కాణిపాకం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు బహుదానది ఉధృతంగా ప్రవహిస్తుడడంతో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున బహుదానదితో గంగమ్మ తల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తవణంపల్లె మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బహుదానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ నది కాణిపాకం ఆలయ సమీపం గుండా ప్రవహిస్తోంది. దీనితో కాణిపాకం ఆలయ తరపున గంగమ్మకు మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ బహుదానది వద్దకు గంగమ్మకు సారె ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు బహుదానదిలో గంగమ్మకు పూజలు నిర్వహించి సారె సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, బాలాజినాయుడు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త

తమిళనాడుకు అక్రమంగా తరులుతున్న వాహనంతో సహా ఎర్రచందనాన్ని పట్టుకొన్నట్లు భాకరాపేట అటవీక్షేత్రాధికారి వెంకట్రమణ తెలిపారు. భాకరాపేట అటవీరేంజ్ పరిధిలో పులిగోనుపల్లి పరిసర ప్రాంతాల నుంచి కారులో అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్నారన్న సమాచారం వచ్చింది. ఈమేరకు అప్రమత్తమైన రేంజ్ సిబ్బంది పులిగోనుపల్లి వద్ద కాపు కాసారు. మంగళవారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో అనుమానిత కారు రావడంతో సిబ్బంది ఆపే ప్రయత్నం చేసారు. అయితే ఆ